# ఎర్రని మట్టిగాజులు

పధ్నాలుగేళ్ళ రాఘవ బామ్మ కాళ్ళకి దణ్ణం పెట్టాడు, ఆ రోజు వాడి పుట్టిన రోజు.... బామ్మ వాడ్ని దీవించింది, మంచి పెన్ను కొనుక్కో అంటూ ఓ యాభై రూపాయలు చేతిలో పెట్టింది. రాఘవకి బామ్మంటే చాలా ఇష్టం.

రాఘవ అలా వెళ్ళి ఇలా వచ్చాడు సైకిలు మీద. బామ్మ చేతిలో పటిక బెల్లం పొట్లం పెట్టి, ఇది బుగ్గని పెట్టుకు చప్పరించు, ఇదిగో నేను పెన్ను కొనుక్కున్నా అన్నాడు బాల్‌పాయింట్ పెన్ను చూపిస్తూ...

సరే, పద స్కూల్‌కి టైమయింది తల్లి గుమ్మంలో నుంచుంది.

రాఘవ పిల్లలందరిలో మంచి పిల్లాడు. పెద్దలంటే వాడికి చాలా గౌరవం. బామ్మంటే మరీ ఇష్టం.

'బామ్మా నువ్వు తినలేవు కానీ, ఇటివ్వు' అంటూ చేగోడీలు చిన్న ముక్కలుగా దంచి పళ్ళెంలో పోసి యిస్తాడు. ముసలివాళ్ళని చిన్న పిల్లల్ని చూసినంత ప్రేమగా, బాగాచూడాలని ఎప్పుడో విన్నమాట వాడి మనసులో నిలిచిపోయింది.

'బామ్మా, ఒక్క దుప్పటి ఏం చలి ఆపుతుందీ, నా రగ్గు కప్పుకో' అంటాడు వెచ్చగా రగ్గు బామ్మకి కప్పుతూ.

రాఘవ బామ్మని ప్రేమగా చూస్తాడని వాడి కజిన్స్ అందరూ 'బామ్మగారూ' అని రాఘవని వెక్కిరిస్తారు కూడా.

బామ్మ ఎంత మంచిదోవాడి చిన్న మనసుకి బాగా తెలుసు. తాతగారు పోయేంతవరకూ బామ్మ ఎంత ఉత్సాహంగా వుండేదో రాఘవకి తెలుసు. ఇంట్లో ఎన్నెన్ని పనులు చేసేదో తెలుసు. తల్లి సుందరి ఏదో వంకతో పుట్టింటికి వెళ్ళిపోయి వారాలు వారాలు రాకపోతే, బామ్మ తనకి, నాన్నకి అన్నం వండి పెట్టడం, టిఫిన్‌లు చేసిపెట్టడం రాఘవకి తెలుసు.

ఇప్పుడు బామ్మ పెద్దదయిపోయింది. పనులు చేయలేదు. ఇప్పుడు మనం బామ్మని మరీ ఎక్కువ ప్రేమగా చూడాలి కదా!

ఒక గాడిద ఎన్నో పనులు చేసేది. దానికి రోజూ అన్నం పెట్టేవాడు దాని యజమాని. అది పెద్దదయి చాకిరి చేయలేకపోతే, దాని తిండి విషయంలో శ్రద్ధ వహించడం మానేశాడు ఆ చాకలి. అది ఎవరితో చెప్పుకుంటుంది పాపం. చివరకి రాజుగారి భవనం ముందున్న ధర్మగంట కొట్టింది. రాఘవ చిన్నప్పుడు చదువుకున్న ఈ పాఠం మరచిపోలేదు.

నువ్వు ముందు తిను, బామ్మగారికి, తరువాత పెట్టవచ్చు 'ఆవిడకేమి తొందర' - ఆఫీసు కెళ్ళాలా' అని తల్లి అత్తగారి మీద ధుమధుమ లాడుతుంది. రాఘవకి తల్లిమీద ఒళ్ళు మండిపోతుంది. 'బామ్మ తిన్నాక నేను తింటా' అన్నాడు. అంతే, ఆ రోజు ఇంట్లో పెద్ద గొడవ చేసి, తన పిల్లాడిని ఆ ముసల్ది గారాబం చేసి పాడుచేస్తోందని అమ్మ అరవటం రాఘవ మరచిపోలేదు.

కాలం ఎవరికోసం ఆగదు కదా. రాఘవ మెడిసిన్ చదవటానికి విశాఖపట్నం వెళ్ళిపోయాడు. రాఘవ అక్క పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది.

రాఘవ తల్లి సుందరికి ఉన్నట్టుండి ఒక ఆలోచన వచ్చింది 'ఇదిగో, ఇంత ఇల్లు మనిద్దరికీ, ఆవిడకీ ఎందుకు చెప్పండి' అంది భర్తతో.

అంటే రామారావుకి అర్థం కాలేదు.

అదే, మీకేమీ అర్థం కాదు, ఆ ముసలావిడగది, ఈ గది రెండూ అద్దెకిచ్చేదాం-,

'ఏమిటీ, అద్దెకిచ్చేద్దామా' రామారావు ఒక్క నిముషం విస్తుపోయాడు.

'అమ్మని' నసిగాడు.

'ఏమిటి - అమ్మ, అమ్మ - లోకంలో ఎవరికీ లేదా- మీ ఒక్కరికేనా' - అరుస్తోంది సుందరి.

'అమ్మ ఎక్కడ వుంటుంది - ఎక్కడ మంచం వేసుకుపడుకుంటుందీ, చెప్పు'-

రామారావు అనగానే పెద్దగా నవ్వి, 'ఏం ఈ వరండాలో పడుకుంటుంది, లేకపోతే, వంటింటి వెనక స్టోర్‌రూములో ఓ మూల పడుకుంటుంది - అదంత పెద్ద విషమయా- డబ్బండీ, డబ్బు- మీకే నాదూ ముందుచూపు లేదు - ఈరెండు గదులూ అద్దెకిచ్చుకుంటే-' సుందరి మాటలు రామారావు గుండెలకి తిన్నగా గుచ్చుకున్నాయి. అంటే, తనతల్లి, ఓమూల ఎక్కడో వుండచ్చా, ఇంత తిండి పడేస్తే చాలా!!!

చూడు, ఇంకొక్కసారి ఇలాంటి మాట నా దగ్గర మాట్లాడకు' రామారావు కోపంగా గదిలోంచి వెళ్ళిపోయాడు.

సుందరి ఇంట్లో పనులన్నీ పూర్తయ్యాక భర్త ఆఫీసుకెళ్ళాక, చెల్లెలికి విశ్రాంతిగా ఫోను చేసింది.

'నువ్వేమో, వృద్ధాశ్రమంలో చేర్చమని అంటున్నావు, నాకూ అది బాగానే వుంది. కానీ మీ బావగారూ నా నోరు మాయించేస్తున్నారు అంది ఫోనులో.

'నేవొస్తున్నా - ఫోన్ పెట్టెయ్'

సుందరి ఫోను పెట్టేసింది. అర్థగంటలో స్కూటర్ వేసుకొని వచ్చేసింది లలిత. వృద్ధుల కేం వాళ్ళు హాయిగా ఉంటారు. టైముకి టిఫిను, భోజనం, ఇంకేంకావాలి ఈ ముసలోళ్ళకి -అయినా, బతికున్నంత కాలం నువ్వే చూస్తావా- మీ బావగారు హాయిగా లండన్‌లో వున్నాడు. -నీకేమిటీ ఈ పీడ లలిత గొంతుక చించుకుంటుంది కావాలనే. గదిలో బామ్మగారు వినాలనే. 'నెమ్మదిగా మాట్లాడు, వింటే బాగుండదు' అంది సుందరి. 'ఆవిడకే చెప్తా.... కాలంతో పాటు మారాలి - లలిత గొంతు పెంచింది.

బామ్మ ఈ మాటల్ని వింటోంది. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి... అనాధలా ఆశ్రమంలో వుండాలా - ఎందుకూ!! నేను ఎవర్ని ఏమీ బాధించటం లేదే, నేనేం బరువు వాళ్ళకీ! - బామ్మ గతం కళ్ళముందు కదిలింది. తన పెద్ద కొడుకు శివరావు చిన్నప్పట్నుంచీ ఆరోగ్యంగానే వుండేవాడు. కానీ చిన్నకొడుకు రామారావు ఎప్పుడూ అనారోగ్యమే....ఎప్పుడూ డాక్టరు, మందులే - పైగా నీకెంత ఓపిక, పిల్లాడిని ఒక్కసారన్న విసుక్కోవు అనేవారంతా. 'అమ్మో, పిల్లలంటే పరమాత్మ స్వరూపాలే - వాళ్ళని విసుక్కోటమేమిటీ' అనేది...అబ్బబ్బ! ఎన్నెన్ని కష్టాలు....ఆఖరికి ఈ చిన్న కొడుకు, అందరికి వ్యతిరేకంగా, ప్రేమ వివాహం చేసుకుంటే కూడా, ఒక్క మాట కొడుకుని, కోడల్ని అనలేదు... మరి, ఎన్నెన్ని- జీవితం అంటే గులాబి పువ్వు అనుకోకు, దానికింద ముళ్ళు కూడా ఉంటాయి అని తండ్రి చెప్పిన మాట ఎంతోనిజం! బామ్మ కన్నీళ్ళు పైకి రాకుండా ఆపుకుంది. తనెక్కడైనా ఉంటుంది - కానీ, తనకి తిండి బట్ట మాత్రమేనా కావలసింది - తెల్లరగానే నా దొడ్లోపూసిన మందారం నా దేవుడికి నేను పెట్టుకోవద్దూ! తెల్లరగానే కాఫీతాగుతూ నాకొడుకు నా మంచం మీద కూచుని, పేపరు విశేషాలు చెప్తూ నాతో మాట్లాడొద్దూ! నా కోడలు గడుసుతనంతో బాటు అమాయకత్వంగా మాట్లాడే, పోట్లాడేవి వినద్దూ! నా రాఘవ బామ్మా అంటూ నాకాళ్ళు నొక్కి, చేగోడీలు దంచి యిస్తే తినొద్దు-ఇవే నాక్కావాలి-నాకు తిండీ బట్ట మాత్రమేనా -ఇన్నాళ్ళు పెంచి పెద్ద చేసి నాకుటుంబం మధ్య నేను హాయిగా నవ్వుతూ బతికి, ఇక్కడే నా తనువు చాలించాలి!! - బామ్మగారు కన్నీళ్ళు తుడుచుకుని, గోడకున్న భర్త పటంకేసి చూసింది.

'ఎప్పుడూ మీకు ముందుచూపే, హాయిగా ఈ బంధాల నుంచి వెళ్ళిపోయారు.....నేనో, నేనో, బామ్మగారు దుఃఖం ఆపుకోలేకపోయింది.

కానీ తనను తను సముదాయించుకుంది. తనెందుకు బరువైందీ అని ఆలోచిస్తుంటే ఏమీ సమాధానం దొరకలేదు...

సుందరి చెల్లెలు లలిత చాలాసేపు అక్కతో మాట్లాడింది.

రెండునెలలుగా ఇంట్లో ఇదే విషయం. ఒక్కోసారి అన్నం తినబుద్ధి పుట్టదు రామారావుకి. తల్లిని ఎందుకు వృద్ధాశ్రమానికి పంపాలని భార్య పట్టుపడుతోందో అర్థంకాదు...

తనకి అర్జంటుగా ఇల్లు అద్దెకిచ్చి డబ్బు సంపాదించాల్సిన అవసరం లేదు. 'మీకేం మీరలాగే అంటారు. డబ్బు ఎంత వుంటే మాత్రం - అయినా మనమేమయినా కోటీశ్వరులమా - ఆ ముసలమ్మ గురించి ఇంత గోల ఏమిటి - మీ యిష్టం నా నిర్ణయం చెప్పా- మీరు, మీ అమ్మవుండండి" - సుందరి ఎదురుగా వున్న గ్లాసు విసిరి పారేసింది. రామారావు గదిలోంచి వెళ్ళిపోయాడు.

బామ్మ మనసు రకరకాలుగా, ఏదో ఆవిడలో తిరుగుతున్నట్టే వుంది... తన మూలంగా ఈ కుటుంబం కలహించుకుంటోందా!!!

రాత్రంతా నిద్రపట్టలేదు బామ్మకి!

ఇంట్లో అంతా నిశ్శబ్దం...కొడుకు తల్లి గదిలోకి రావటానికి వెనుకాడుతున్నాడు.... సుందరి, అత్తగారితో మాట్లాడమే మానేసింది..

ఆరాత్రి బామ్మగారు చేతిలో ఫోన్ పట్టుకుని, లలితకి ఫోన్ చేసింది.... చాలాసేపు మాట్లాడి, "రేపే" అంది. ఫోను పెట్టేసింది.

రాత్రి పదకొండుగంటలకి ఫోన్ మోగింది. సుందరి లలిత గొంతు విని, 'ఏమిటీ' అంది. 'నేను చెప్పలేదూ - నీకు గుడ్ న్యూస్ - మీ ముసల్ది మా హోమ్‌లో చేరుతుందిట, రాత్రి నాకు ఫోన్‌చేసింది చూసేవా! కాగల కార్యం గంధర్వులు తీర్చారన్నట్టు, ఆవిడే ఫోన్ చేసిందిగా, నీకేం భయం లేదు-"

లలిత మాటలు చాలా ఆనందాన్నిచ్చాయి. నిజమే - ఆవిడకి మాత్రం, ఇక్కడ కన్నా అక్కడే బావుంటుందని అర్థమయింది లావుందిలే - సుందరి అటునించి ఇటు వత్తిగిల్లింది. భర్త ఒంటి పై చేయివేద్దామని అటు చూసే సరికి, భర్త పక్కన లేదు - ఏమయ్యాడు!!!

రామారావుని తల్లి, ఒక్కసారి, నీపని అయ్యాక, ఇటురా అంది రాత్రి, భోజనాలయ్యాక.

రామారావు తల్లి మంచం మీద కూచున్నాడు. 'ఎందుకు అనవసరం గొడవపడకు దాంతో. నువ్వు అది హాయిగా వుంటే చాలు.' ఈ రెండు గదులు అద్దెకిచ్చేసుకుంటే బోల్డు డబ్బులూ... ఏదో ముసలి తల్లి మాటలు చెప్తోంది రామారావు ఏమీ అనలేకపోతున్నాడు.

అదెంత మూర్ఖురాలో నీకూ నాకూ తెలుసు - ఆ రోజు నీ మీది కోపంతో నిద్రమాత్రలు మింగిందా - ఏదో నీ పరువు దేవుడు కాపాడాడు - ఇప్పుడు మరో రకంగా నిన్ను బెదిరిస్తుంది - నేను తప్పుకుంటే తల్లిగొంతు గద్గదికమవటం గమనించక పోలేదు కొడుకు!!

సుందరి అత్తగారి గదిలో లైటు వెలగటం, మంచం మీద కూచుని తల్లికొడుకు గుసగుసలు చెప్పుకోవటం గమనించింది. గబుక్కున తన గదిలో కొచ్చి, ముసుగుతన్ని నిద్రపోయింది.

రెండు గదులు పద్దెనిమిది వందలకి అద్దెకిచ్చింది సుందరి... ఈ డబ్బెవరదీ, మీదీ, నాదీ కాదా, అందుకే-

మళ్ళీ సుందరి ఏంచెప్తుందో తెలుసు రామారావుకి దీర్ఘంగా నిట్టూర్చాడు.

ఇరవై రోజుల సెలవులకి హైదరాబాద్ వస్తున్న రాఘవ, ముందు బామ్మకి ఏది యిష్టమైనవి కొనాలి అనుకున్నాడు. పూతరేకులు, మామిడి తాండ్ర, - చాలు ఇవి బామ్మకి యిచ్చి, కాళ్ళకి దణ్ణం పెడితే చాలు!!!

కొడుకుని కార్లో తీసుకురావటానికి కొచ్చింది స్టేషన్‌కి సుందరి. రాఘవ రైలు దిగగానే ఎదురుగా వున్న తల్లిని, లలిత పిన్నిని చూస్తూ, స్టేషన్లో కొన్న సంపంగి పూల పొట్లం అందించాడు...

'బామ్మ కోసం ఏం తెచ్చానో గెస్ చేయి అన్నాడు తల్లితో. "ఆ, చెగోడీలు - అని ఇప్పుడు మెత్తగాదంచి...."

"ఛఛ....కాదు మమ్మీ - పూతరేకులు అన్నాడు ఎంతో" ఉత్సాహంగా,

గబగబా లోపలకెడుతుంటే, అటుకాదు, ఇటు అంది సుందరి.

రాఘవ కళ్ళు బామ్మకోసం వెతుకుతున్నాయి. ఎంతసేపు వెతికితే బామ్మ ఆగదిలో మంచం మీద కనిపిస్తుందీ?!

"ఏమిటీ బామ్మా, ఏమిటిదీ,"-

"నేనే వచ్చా - మీ అమ్మ, నాన్న నన్ను ఇక్కడ వుండొద్దని ఒకటే గోల - మీ అమ్మ అయితే, అత్తయ్యా, మీరు కాకుడం నేనొక్కర్తెనీ ఇంత ఇంట్లో వుండలేనని ఒకటే గోల- బామ్మ మాటలకి అటు చూస్తూ ఊరుకుంది సుందరి.

రాఘవ అటు ఇటు చూశాడు ఈ వృద్ధులందరూ దిక్కులేని వాళ్ళేనా.... ఏ చేతుల్తో పెంచి పెద్ద వాళ్ళని చేసారో ఆ చేతులు బలంలేక వణుకుతుంటే అన్నం పళ్ళెం పడిపోకుండా పట్టుకుంటున్న వీళ్లంతా ఎవరూ - ఏ నాగరికతకు ఇది చిహ్నం!!!

మా తాతమ్మ కల్లు తాగుతుందండీ - పాపం అదిలేకపోతే నిద్రరాదండీ అంటూ తనని వెంటబెట్టుకెళ్ళి, తొంభైఏళ్ళ తాతమ్మను తనకి చూపిన తన చిన్ననాటి పాలేరు సీను కళ్ళముందు కదిలాడు రాఘవకి.

నా ముసలాడు మంచలోంచి లేవలేడండయ్యా - అందుకు నేనేదో తిప్పలు పడి, గంజికాసి పోసి వాడికి ఒళ్ళు రుద్ది నీళ్ళోసి, పంచకట్టి, మంచం మీద పడుకో, ఇప్పుడే వస్తానని ఇటు వచ్చేసా అంటూ చీపురు తీసుకు గబగబా ఊడ్చేసే, తన చిన్ననాటి ముసలి పనిమనిషి సీతాలు గుర్తొచ్చింది రాఘవకి.

ఆచోట ఒక్క క్షణం వుండలేకపోయాడు రాఘవ. గుండెద్రవించింది... ఈ నాగరికత మంచో చెడ్డో నాకు తెలియదు. కానీ, నా బామ్మని ఇక్కడ పడేయటం నా నాగరికతా - రాఘవ యువక రక్తం పొంగి పొర్లింది.

"డాడీ మీరన్నా చెప్పద్దా - బామ్మ ఒక్కర్తే అక్కడ వుంటే, మీకు అన్నం తినాలనిపిస్తోందా - నిజం చెప్పండి డాడీ, బామ్మని మీరు, అమ్మ కదు అక్కడికి పంపింది." ఆవేశంతో ఊగిపోతున్న కొడుకుని చూస్తూ మాటరాక ఉండిపోయారు తల్లితండ్రీ! 'ఏమిటిరా గోల,' ఆ ముసల్ది నేను ఇక్కడ ఉండనని ఒక్కటే గోల- సుందరి అంటుంటే, రాఘవ అబద్ధం, అబద్ధం అరిచాడు.

'బామ్మ నా దగ్గర అబద్ధం చెప్పదు, నేను వెళ్ళి అడుగులే బామ్మని తీసుకొచ్చేస్తా' అన్నాడు.

సుందరికి తెలుసు ఈ కుర్ర తనపు ఆవేశాన్ని ఆ బామ్మ అర్థం చేసుకుంటుందని, ఖచ్చితంగా వీడితో అబద్ధమే చెప్తుందని

సాయంత్రం ఐదు గంటలయింది. బామ్మ రాఘవకోసం ఎదురుచూస్తోంది. 'రా', నీకోసమే, దాచిపెట్టి' అంది కాగితంలో చుట్టిన మసాలా వడతీసిస్తూ, సాయంత్రం ఆ రోజు ఎవరో వడలు యిచ్చారట అందరికీ పంచమని. బామ్మ తను తినకుండా దాచింది రాఘవకివ్వాలని.

రాఘవ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

'బామ్మా నిజం చెప్పు. అమ్మా నాన్న నిన్ను ఇక్కడ వుండమన్నారు కదూ - నిజం చెప్పు' అన్నాడు. బామ్మ ముఖం ఒక్క క్షణం వెలవెలపోయింది.

నాకు ఎర్రని మట్టిగాజులు కావాలిరా అంది మాటమారుస్తూ.

"ఏమిటీ"

ఎర్రని మట్టి గాజులా - ఏంటి బామ్మా గాజులేంటి అన్నాడు రాఘవ.

నువ్వు పరీక్ష పాసయ్యావా

"ఆ"

"మీ అమ్మ కారు డ్రైవింగ్ జాగ్రత్తగా చేస్తోందా"

"ఆ"

అయితే రాఘువ చిరాగ్గా అటు ఇటు చూస్తున్నాడు.

బామ్మకి మతి చలించలేదుగా....తను పరీక్ష పాసయితే ఈ రోడ్డు రష్‌లో జాగ్రత్తగా అమ్మ కారు డ్రైవ్ చేస్తుంటే - మట్టిగాజు లేమిటీ - భయం భయంగా చూస్తున్నాడు బామ్మకేసి రాఘువ. "అమ్మవారికి మొక్కుకున్నా.... దుర్గాదేవికి ఎర్రని గాజులు తొడిగిస్తానని, ఎర్రని చీరకట్టిస్తానని...

రాఘువ నవ్వాడు...విరగబడి నవ్వాడు.

"చీర నేను వచ్చే ముందు తెప్పించాను, గాజులు నువ్వు తెచ్చి, అమ్మవారికి యిచ్చి దణ్ణం పెట్టుకో" - రాఘువ ఆశ్చర్యంలో ఏడ్పు, ఏడ్పులో నవ్వు-

ఈ మానవత్వానికి ఏమివ్వగలడు తను!!! ఇంట్లోంచి వెళ్ళగొట్టిన కోడలు, కొడుకు క్షేమంగా ఉండటానికి అమ్మవారికి మొక్కులు తీరుస్తుందా!!

బామ్మా, నీలాంటి ఆడవాళ్ళే లోకమంతా ఎందుకు లేరూ - మా అమ్మలాంటి ఆడవాళ్ళే లోకమంతా ఎందుకుంటున్నారూ - ఇది ఏ నాగరికతకి అపశృతి!!! రాఘువ కన్నీళ్ళు ఆగటం లేదు....

తెస్తావు కదూ - ఎర్రని మట్టిగాజులు - "ఆ-ఆ" రాఘువ వెళ్ళిపోయాడు. బామ్మ గొంతు చెవిలో ప్రతిధ్వనిస్తోంది. అనుకోని వర్షం కుండపోతగా కురుస్తోంటే తడిసిపోయి యింటికొచ్చిన రాఘువని చూసింది తల్లి.

రాఘువ మనసంతా పాడయిపోయింది. బామ్మ లేకుండా ఆ ఇంట్లో వుండటం చిరాకనిపించింది -ఊరెళ్ళిపోవాలనిపించింది.

కానీ, ఎర్రమట్టిగాజులు కొని బామ్మకి చూపించి, గుళ్ళో అమ్మవారికియ్యాలిగా...

ఆమాట చెప్తే సుందరి నవ్వి, ఆవిడకేదో పిచ్చి పట్టి మాట్లాడుతుంది. ఆ మాటకోసం నువ్వు గాజుల షాపుకుపోయి గాజులు తెస్తావా - నవ్వుతూరు అంది తేలిగ్గా.

రాఘువ తల్లి మాటల్లో వున్న హేళనకి మండిపడ్డాడు. 'నువ్వు అమ్మవే. మర్చిపోకు, కొన్నేళ్ళు పోయాక నువ్వూ బామ్మవే!

రాఘువకోపంగా ఇంట్లోంచి బయటకెళ్ళాడు. ఆరాత్రి కురిసిన పెద్ద వర్షానికి అక్కడక్కడ చెట్లుకూలాయి. రోడ్లల్లో నీళ్ళు ఇంకా పూర్తిగా ఇంకిపోలేదు.... బయటకి రావటమే చిరాగ్గా వుంది. అయితే మాత్రం బామ్మని చూడద్దూ!!

ఎర్రని గాజులు అట్టడబ్బాలో పెట్టి ఆ డబ్బా ప్లాస్టిక్ కవర్లో పెట్టి, గబగబా మెట్లెక్కాడు రాఘవ. ఆ ఎర్రచీర, ఎర్రగాజులు తనే తీసికెళ్ళి అమ్మవారికిచ్చి దణ్ణం పెడతాడు - ఎవరయితేనేం!!

గుమ్మంలో అడుగుపెట్టిన రాఘవ నోటమాటరాలేదు. నిర్జీవంగా పడున్న బామ్మని చూస్తూ....రాత్రి గుండెనొప్పి అందని, తెల్లారేసరిగి వెళ్లిపోయిందని అక్కడవాళ్ళు చెప్తుంటే, రాఘవ చేతిలో వున్న మట్టిగాజులు కిందపడి చెల్లాచెదురై ముక్కలైపోయాయి!!..

డాక్టర్ రాఘవ ఇల్లు శారదాంబ నర్సింగ్ హోమ్ అయింది.. తెలియనివాళ్ళు ఆ డాక్టరు గారికి తల్లిగారంటే ఎంత ప్రేమో, ఆమె బతికివుండగానే ఆమె పేరున పెద్ద నర్సింగ్ హోమ్ పెట్టాడు ఆబాబూ అని మెచ్చుకుంటున్నారు రాఘవని. ఆ శారదాంబ పటం ముందు, పళ్ళెంలో ఎర్రని గాజులుంటాయి రోజూ ఆ గాజులకి నమస్కరించి నర్సింగ్‌హోమ్‌లోకి అడుగుపెడతాడు రాఘవ. రాఘవబాబు ధర్మాత్ముడు. ఆయన హస్తవాసి ఎంత మంచిదో - అందరి నోటంటా అదే మాట.

సుందరి, రామారావు నర్సింగ్ హోమ్ మేడమీద హాయిగా కాలం గడుపుతున్నారు.

కాలం పరిగెత్తింది...రాఘవ నెత్తిపైన వెండితీగలు మెరుస్తున్నాయ్... రాఘవ కొడుకు సుధీర్ తండ్రితత్వానికి పూర్తిగా భిన్నం.

'ఏమిటి డాడీ - మరీ పెద్దవారయిపోయారు. ఈ నర్సింగ్ హోమ్ ఎవరు చూస్తారు - అయినా, డబ్బు కూడా ఏమీ రావటంలేదు - పైగా మీరు ముసలాళ్ళకి ఫ్రీ ట్రీట్‌మెంట్ అంటారు. బీదవాళ్ళకి ఉచితం అంటారు. నసుకుతున్నాడు సుధీర్. ఆరోజు పడక్కుర్చీలో పడుకుని పేపరు తిరగేస్తున్న తండ్రి రాఘవతో నేనున్నంత కాలం ఈ నర్సింగ్ హోమ్ ఇలానే ఉంటుంది. ఏం, ఉన్న డబ్బు చాలదా రాఘవ ముఖం పేపర్లోనే ఉంది.

"అది కాదు డాడీ - లోకమంతా ఒకవైపు పరిగెడుతుంటే మీరొకవైపేమిటీ డాడీ - బామ్మని తాతని ఓల్డు హోమ్‌కి పంపేద్దాం-

'మరినన్నో'-

రాఘవ భార్య పోయి రెండేళ్ళయింది,

'నిజంగానే మీరు కూడా హాయిగా వుండొచ్చు... అంతే మీలాంటి వాళ్ళే - ఈ ఇల్లు, కిందా పైన అద్దెకిచ్చేస్తే, అబ్బ, ఎంత అద్దె వస్తుందో తెలుసా డాడీ' - రాఘవ నోట మాట రావటం లేదు, తన కళ్ళముందే తన విలువలు తారుమారుయి పోవటం. తనకొడుకు డబ్బు వెంట పరుగులు తీయటం!!

సుధీర్ మనసులో ఎలాగైనా ఇంత పెద్ద యిల్లు అద్దెకిచ్చేసి, తన భార్య ఫ్లాట్‌లో కెళ్ళాలని, ముసలాయనని హోమ్‌లో చేర్చాలని!!!- ఆ ఆలోచన మహావృక్షమవుతోంది క్షణాలలో.

రాఘవ ఏమీ మాట్లాడకుండా నర్సింగ్ హోమ్‌లోకి నడిచాడు.... శారదాంబ పటం ముందున్న ఎర్రని మట్టిగాజులు మరీ మట్టి కొట్టుకుపోయి వెలవెలపోతున్నట్లనిపించాయి.

ఒక్కసారి దులిపి, కడిగి బామ్మపటం ముందు పెట్టాలని తీయబోయాడు రాఘవ. అంతే ఆ ప్లేటు చేతిలోంచి జారిపోయింది. ఎర్రని మట్టిగాజులు నేలంతా చెల్లాచెదరై, ముక్కముక్కలయ్యాయి!!

- ఒక్కముక్క కూడా ఏరి తీసే ప్రయత్నం చేయకుండా కిందకి దిగొచ్చి పడక్కుర్చీలో వాలిపోయాడు డాక్టర్ రాఘవ.

- వినూత్న శ్రీ లేఖ సచిత్ర మాస పత్రిక ఆగష్టు 2002